

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

ఏలూరు జిల్లా
పశ్చిమ గోదావరి జిల్లా

గురువారం,15 మే 2025

8 పేజీలు


### నారా లోకేష్,'పల్లా'ను కలిసిన

# ఉమ్మడి ప.గో.జిల్లా నేతలు



**అమరావతి/తాడేపల్లిగూడెం,మేజర్‌న్యూస్ :** వివిధ శాఖల చైర్మన్లుగా పదవులు లభించిన గన్ని వీరాంజనేయులు, వలవల బాబ్జి, బూరుగుపల్లి శేషారావు,కె.ఎస్.జవహర్ అమరావతిలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ను, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు వల్ల శ్రీనివాసులు కలిసి కృతజ్ఞతలు తెలిపారు. వీరితో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ గొర్రెల శ్రీధర్, వాడపల్లి సుబ్బరాజు, పరిమి రవికుమార్, గంధం సతీష్, పసల కొండ తదితరులు పాల్గొన్నారు.

## విధుల నుండి 5గురు వర్క్ ఇన్స్పెక్టర్ల తొలగింపు

**ఏలూరు,మేజర్‌న్యూస్:**
ఏలూరు జిల్లా నూజివీడు మండలం సుంకొల్లు గ్రామములో గృహ నిర్మాణ లబ్ధిదారులకు అందవలసిన సామగ్రి ప్రక్కదారి పట్టినదని వచ్చిన ఆరోపణలపై రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి వారి ఆదేశాల మేరకు అధికారులు దర్యాప్తు జరిపి 2,450 బస్తాల సిమెంటు,11,952 కెజీల స్టీలు లబ్దిదారులకు అందలేదని వీటి విలువవెరసి రూ.16,52,895లుగా ధ్రువీకరించారు. గృహ నిర్మాణ సంస్థ గోదాముల నుండి సిమెంట్ స్టీలు విడుదల చేసిన పొరుగు సేవల సిబ్బంది 5 గురు వర్క్ ఇన్స్పెక్టర్లను విధుల నుండి తొలగిస్తూ వారి నుండి ఈమొత్తం రికవరీ చేయవలసినదిగా జిల్లా కలెక్టర్ ఆదేశించినట్లు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ జిల్లాఅధికారి జి.వి.వి.సత్యనారాయణ తెలిపారు. సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్‌పై తగినచర్యలు తీసుకోవల సిన పర్యవేక్షక ఇంజనీరు, పంచాయతీరాజ్‌శాఖ, ఏలూరు వారిని ఆదేశించారు.

### భీమవరం బస్‌స్టాండ్‌లో

# మాక్ డ్రిల్

- ఏపీఎస్ డిఆర్ఎఫ్‌తో పాటు పాల్గొన్న వివిధ శాఖలు
- అభినందించిన కలెక్టర్ నాగరాణి,ఎస్పీ నయీమ్ అస్మి







**భీమవరం,మేజర్‌న్యూస్ :** స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ ఆదేశాల మేరకు పశ్చిమగోదావరి జిల్లా కేంద్రం భీమవరం బస్ కాంప్లెక్స్‌లో బుధవారం మాక్ డ్రిల్ నిర్వహించారు. యుద్ధంసందర్భంగా గాని అనుకోకుండా జరిగేప్రమాదాల్లో కానీ ప్రజలు తమను తాము ఎలా రక్షించుకోవాలి అలాగే ప్రభుత్వ సంస్థలు ఎలాగా వారిని కాపాడాలి అనే అంశంపై మాక్ డ్రిల్ నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ తోపాటు ఫైర్ డిపార్ట్మెంట్, ఆర్మ్‌డ్ పోర్స్,లా అండ్ ఆర్డర్ డిపార్ట్మెంట్, రెవిన్యూ, మెడికల్ అండ్ హెల్త్, భీమవరం మున్సిపాలిటీ ,ఏపీఎస్ ఆర్టీసీ, 108, ఎలక్ట్రికల్ డిపార్ట్మెంట్లు మాక్ డ్రిల్‌లో పాల్గొన్నాయి. అవసరమైనప్పుడు అధికారులు ఏ విధంగా ప్రజలను అప్రమత్తం చేస్తూ లాంగ్ సైరన్ మోగించాలి, అలాగే ప్రజలు ఏ విధంగా స్పందించాలి అనేదానిపై అభ్యాస వ్యాయామం చేయించారు. సైరన్ వదిలినప్పుడు కాంపస్ కాంప్లెక్స్‌లో ఉన్న ప్రయాణికులు రెండు చెవిలలో వేళ్ళు పెట్టుకొని

- తరువాయి 2లో..

### చినలింగంపాడు చెరువులో జారిపడి

# ముగ్గురు యువకులు మృతి

- మృతుల్లో ఒకరికి వివాహం,ఇద్దరు పిల్లలు -వేగివాడలో విషాదం









**భీమడోలు,మేజర్‌న్యూస్ :** గ్రామపంచాయతీ పరిధిలోనిచినలింగంపాడు ఆవాస ప్రాంతంలో జరుగుతున్న ఒకశుభకార్యక్రమంలో పాల్గొనేం దుకు వచ్చిన ఐదుగురు మిత్రబృందంలో ముగ్గురు ప్రమాదవశాత్తు చెరువులోకి జారిపడి చనిపోయిన విషాధ సంఘటన బుధవారం చోటుచేసుకుంది.

భీమడోలు పోలీసులు తెలిపిన వివరాల మేరకు పెదవేగి మండలం వేగివాడ గ్రామానికి చెందిన నున్న ప్రవీణ్, నేతల ఆనంద హర్ష, నేతల అజయ్ అలియాస్ కెనడాం(30), నేతల సాగర్ అలియాస్ నాని(23),చొక్కా అభిలాష్,(22) మిత్రులు. వీరందరూ బుధవారం చిన్నలింగంపాడులో జరుగుతున్నశుభకార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చారు.మధ్యాహ్న సమయంలో కాలకృత్యాలు తీసుకునేందుకు కోమటికుంట చెరువు వద్దకు వచ్చారు. శుభపర్చుకొనే క్రమంలో వారిలో ముగ్గురు(అజయ్,సాగర్,అభిలాష్,) చెరువు లోకి జారిపోయారు. మిగిలిన ఇద్దరు వారిని రక్షించే ప్రయత్నం చేసినప్పటికీ ఫలప్రదం కాలేదు. దీనితో వారు ఇతరుల సహాయం కోసం ప్రయత్నంచేశారు.విషయం తెలుసు కున్న భీమడోలు సిఐ యు.జె. విల్సన్ తమ సిబ్బందితో ఎస్సైసుధాకర్,ఎఎస్ఐ చలపతి రావుసహకారంతోఘటనాస్థలనికి చేరుకున్నా రు. రక్షణ చర్యలు చేపట్టారు.

నీట మునిగిన ముగ్గురిని భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రా నికి తీసుకువచ్చారు .అప్పటికేవారు చనిపోయి నట్లువైద్యులు తెలిపారు.శవాలపంచ నామాను భీమడోలు వీఆర్వోలు ముగ్గురు చేపట్టారు. మృతులలో నేతలఅజయ్‌కువివాహం కాగా, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మిగిలిన మృతులకు వివాహాలు కాలేదు. పోస్టుమార్టం నిమిత్తం శవాలను ఏలూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

## రైతులకు మేలు చేసేది కూటమి ప్రభుత్వం

**మంత్రి రామానాయుడుచే 182.27 లక్షల అభివృద్ధి పనులకు శ్రీకారం**

**పాలకొల్లు,మేజర్‌న్యూస్ :** రాష్ట్రంలో రైతాంగానికిమేలు చేసేదికూటమి ప్రభుత్వ మనేందుకుజరుగుతున్న పనులే నిదర్శన మని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడుఅన్నారు .మన రైతు-మన రామా నాయుడు కార్య క్రమంలోభాగంగాబుధవారం సాయంత్రం పోడూరు మండలం అప్పనచెరువు గ్రామం పరిధిలో చర్చి దగ్గరలో15లక్షలతో గగ్గిపర్రు మైనర్ డ్రైన్‌పై సి.సి.వాల్ నిర్మాణ పనులకు,పెనుమదం గ్రామం పరిధిలో ఎస్.ఆర్. ఆర్. పేట దగ్గరలో కాజ మేజర్ డ్రైన్‌పై 11.36 లక్షలతో గ్రావెల్ రహదారి నిర్మాణ పనులకు,

- తరువాయి 2లో..





## పోలవరం ప్రభుత్వ వైద్యశాలలో నిండు గర్భిణీ మృతి

**- వైద్యాధికారుల నిర్లక్ష్యమే కారణమంటున్న బంధువులు**

**పోలవరం,మేజర్‌న్యూస్ :** వైద్యాధికారులు నిర్లక్ష్యం ఒక నిండు గర్భిణీ ప్రాణాలు తీసుకున్న సంఘటన పోలవరం మండల కేంద్రంలో బుధవారం ఉదయం చోటుచేసుకుంది.
మృతురాలి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం పోలవరం మండలం జిల్లాల గూడెం పంచాయతీ కొత్త కుంకాల గ్రామానికి చెందిన థామస్ శిరీష 24 సంవత్సరాలి మంగళవారం రాత్రి 10గంటలకు9 నెలల గర్భిణీ పురిటి నొప్పులు రావడంతో పోలవరం ప్రభుత్వ ఆరోగ్య కేంద్రానికి ఆటోపై తీసుకురాగా సిబ్బంది ఆస్పత్రిలో జాయిన్ చేసుకున్నారు అయితే గైనకాలజిస్ట్ అందుబాటులో లేకపోవడం వైద్యాధికారుల పర్యవేక్షణ లేకపోవడం వలన బుధవారం ఉదయం7.30గంటలకు





- తరువాయి 2లో..

# సిబిఎస్ఈ 10వ మరియు 12వ తరగతి ఫలితాలలో లక్ష్య ప్రభంజనం












**కాకినాడ,మేజర్‌న్యూస్** : మే 13వ తారీఖున విడుదలైన సిబిఎస్ఈ 10వ తరగతి మరియు 12వ తరగతి ఫలితాలలో లక్ష్య ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలను కైవసం చేసుకున్నారు. సిబిఎస్ఈ 10వ తరగతి విద్యార్థులు 100%ఉత్తీర్ణతసాధించారు.లక్ష్య ఇంటర్నేషనల్ స్కూల్‌లో చదువుతున్న మంగళంపల్లి వెంకట సుందర నిహాల్ 490/500 మార్కులతో (98%) రీజన్‌లో మొదటి స్థానంలో ఉండగా జి.రిత్విక్ నరసింహ 488/500 (97.6%), నున్న శ్రీసాన్వి 482/500 (96%),పైడాసుదిత్ 479/500(96%)అత్యధిక మార్కులు సాధించారు. 40% విద్యార్థులు90%పైబడిమార్కులు సాధించగలిగారు. 10వ తరగతి ఫలితాలలో సబ్జెక్టుల వారీగా ఇంగ్లీషు (15), గణితం (7), తెలుగు (6), హిందీ (3), సైన్స్ (10), సోషల్ (12), ఐసిటి (18), విభాగాలలో విద్యార్థులు10పాయింట్స్ కైవసం చేసుకున్నారు. సిబిఎస్ఈ 12వ తరగతి ఫలితాలలో లక్ష్య విద్యార్థి సత్యం 489/500 (98%) అత్యధిక మార్కులు సాధించి 100%ఉత్తీర్ణతసాధించారు.12వ తరగతిలో సబ్జెక్టు వారీగా ఇంగ్లీషు (15), గణితం (6),ఫిజిక్స్ (3), కెమిస్ట్రీ (7), బయాలజీ (7), కంప్యూటరు సైన్స్ (10), విభాగాలలో విద్యార్థులు 10 పాయింట్స్ సాధించారు. లక్ష్య ఇంటర్నేషనల్ స్కూల్ డైరెక్టర్ డాక్టర్ సుగుణరెడ్డి మాట్లాడుతూ సిబిఎస్ఈ 10వ తరగతి మరియు 12వ తరగతి అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించారు. లక్ష్య 10వ తరగతి మరియు 12వ తరగతి అధ్యాపకులకు ప్రత్యేకఅభినందనలు తెలియ జేశారు. 10,12వతరగతి విద్యార్థులకు ప్రత్యేక మైన క్లాసులను ఏర్పాటు చేసి అనుభవజ్ఞులైన అధ్యాపకులను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈవిధంగా విద్యార్థులు అత్యధిక రిజల్ట్ సాధించినప్పుడే నిజమైన ఆనందం కలుగుతుందని తెలియ జేశారు. విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలు కలిగిన విద్యను అందించడంలోలక్ష్యఎప్పుడుముందుంటుందని తెలియజేశారు .లక్ష్య విద్యార్థులు నాన్-అకడమిక్స్‌లోనేకాకుండాఅకడమిక్స్‌లో అత్యుత్తమ మార్కులతో తమ సత్తా చూపారని తెలియజేశారు. ఈ సందర్భంగా లక్ష్య ఇంటర్నేషనల్ స్కూల్ ప్రిన్సిపల్ వందన బోహ్రా గారికి వైస్ ప్రిన్సిపల్ హేమలత,ఇతరఅధ్యాపక బృందానికి ప్రత్యేక అభినందనలు తెలియ జేశారు.ఆదిత్య విద్యసంస్థల ఛైర్మన్ డా.ఎన్.శేషారెడ్డి మాట్లాడుతూ లక్ష్యవిద్యార్థులు 100% ఉత్తీర్ణతతో 40%, విద్యార్థులు 90% మార్కులు సాధించినందుకు లక్ష్య డైరెక్టర్ డాక్టర్ సుగుణరెడ్డి గారిని కొనియాడారు. ప్రిన్సిపల్ మరియు అధ్యాపకబృందానికి అభినందనలు తెలియజేశారు. అత్యధికమార్కులు సాధించిన విద్యార్థులను అభినందించారు. లక్ష్య ఇంటర్నేషనల్ స్కూల్ యాజమాన్యం 10వ మరియు 12వ తరగతి ఫలితాలలో ఉత్తమ ప్రతిభను కనబరిచిన విద్యార్థులను, వారి తల్లితండ్రులను సత్కరించారు. లక్ష్య ఇంటర్ నేషనల్ స్కూల్ ప్రిన్సిపాల్ వందన బోహ్రా మాట్లాడుతూ సిబిఎస్ ఈ 10వ మరియు 12వ తరగతి ఫలితాలలో అనేక మంది విద్యార్థుల 10 పాయింట్స్ సాధించారని తెలియజేసారు. విద్యార్థుల కృషి, ఉపాధ్యాయుల మార్గదర్శకం ఈవిజయానికికారణమని తెలియజేసారు.

# పోలవరం ప్రభుత్వ వైద్యశాలలో నిండు గర్భిణీ మృతి

మొదటిపేజి తరువాయి

మరణించింది. మృతురాలి బంధువులు వైద్యులు సకాలంలో స్పందించి మెరుగైన వైద్య సేవలు అందించి ఉంటే ప్రాణాలు దక్కమని వైద్యుల నిర్లక్ష్యమే నిండు గర్భిణీ ప్రాణాలు పోవడానికి కారణమని ఆరోపిస్తున్నారు.- **నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై చర్యలు** -పోలవరం సామజిక ఆసుపత్రిలో బుధవారం తెల్లవారుఝామున గర్భిణీ స్త్రీ మృతి విషయంలో డ్యూటీలో ఉన్న డాక్టర్,ప్రసూతి వైద్య నిపుణులు సకాలంలో స్పందించి వైద్యం అందించలేదని ప్రాథమిక దర్యాప్తులో తేలిందని జిల్లా ఆసుపత్రి సేవల సమన్వయాధికారి డా.పాల్ సతీష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయంలో పూర్తి స్థాయి విచారణకు ఆదేశించడం జరిగిందని, వైద్యం అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని డా.పాల్ సతీష్ ఏలూరులో బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

# కష్టపడి చదివిన విద్యార్థినీ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు



**- జాయింట్ కలెక్టర్ నిషాంతి**

**అమలాపురం, మేజర్ న్యూస్** : కష్టపడి చదివిన విద్యార్థినీ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు సొంతం అవుతుందని, భవిష్యత్తులో ఉన్నత విద్యాభ్యాసానికి జిల్లా యంత్రాంగం అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించి భరోసాగా ఉండి అండగా నిలుస్తుందని జిల్లా జాయింట్ కలెక్టర్ టీ.నిషాంతి మెరిట్ విద్యార్థులకు సూచించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ నందు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి పబ్లిక్ పరీక్షలలో అధిక మార్కులు పొందిన విద్యార్థినీ విద్యార్థులను జిల్లా జాయింట్ కలెక్టర్ చేతుల మీదుగా నిఘంటువులు బహుకరించి ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిభావంతులైన విద్యార్థులను అభినందించడం చాలాముఖ్యమని,వారి కృషి, పట్టుదల, అంకితభావానికి ఈ ప్రశంసలు ఒక గుర్తింపుగా నిలుస్తాయన్నారు. మెరిట్ సాధించిన విద్యా ర్థులందరికీ ఆమె హృదయ పూర్వక అభినందనలు తెలిపారు విద్యార్థుల అద్భుతమైన విజయాలు జిల్లా విద్యా శాఖ పనితీరుకు నిదర్శనమని. ఈ విజయాలు పాఠశాలకే కాకుండా, మీ కుటుంబానికి కూడా గర్వకా రణంగా నిలుస్తారన్నారు. విద్యార్థినీ విద్యార్థులు భవిష్యత్తులో ఏయేఉన్నత చదువులు అభ్యసించాల నుకుంటున్నారన్న విషయాలను ఆమెఅడిగి తెలుసుకు న్నారు. మీరు భవిష్యతులో కూడా ఇలాంటి విజయాల పరంపరను ప్రతిదశలో సాధించాలని,ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆమె ఆకాంక్షించారు విద్యార్థుల కలలు ఆశయాలు సాకారం కావాలని ఆకాంక్షిస్తూ ఆమె శుభాకాంక్షలు తెలిపారు. ఈ విజయం కేవలం విద్యార్థుల ఒక్కరిదే కాదనీ. మీకు సహకరించినమీతల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, శ్రేయోభిలాషు లందరికీ కూడా అభినందనలు తెలిపారు.మీ ప్రతిభను విశ్వసించడం ద్వారా విజయం మీ వెంటే ఉంటుందన్నారు. ప్రతి దశలో టాపర్గా నిలవాలని సూచించారు.

## నిత్యావసర సరుకులు పంపిణీ చేసిన షేక్ బాజీ



ఏలూరు,మేజర్‌న్యూస్ : పేద ముస్లిం మహిళలు పలువురికి బుధవారం డాక్టర్ షేక్‌బాజీ(గాజులుబాజీ) నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏలూరు నూర్ బాషా సంఘ నాయకులు షేక్ సత్తార్ ,తదితరులు పాల్గొన్నారు.

## భీమవరం బస్టాండ్‌లో మాక్ డ్రిల్

మొదటిపేజి తరువాయి

ఎక్కడికక్కడ పడుకుని పోయారు. అలాగే గాయపడిన వారిని వెంటనే ఏ విధంగా ప్రాథమిక చికిత్స చేసి అంబులెన్స్ లో తరలించే సన్నివేశాలను అభ్యాసం చేయించారు. జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి గాయపడిన బాధితులను స్ట్రక్చర్ పై అంబులెన్స్ కు తరలించినప్పుడు స్ట్రక్చర్ను పట్టుకొని సహాయం చేశారు, అలాగే కలెక్టర్ కార్బన్ డయాక్సైడ్ సిలిండర్తో గ్యాస్ సిలిండర్ను మంటలను ఆర్పి వేశారు.. మొత్తం మీద విపత్తుల ఏర్పడినప్పుడు ఏ విధంగా ప్రభుత్వ శాఖలు సహాయం చేయాలి. అలాగే ప్రజలు ఏ విధంగా విపత్తులను ఎదుర్కోవాలి స్పందించాలనే దానిపై భీమవరంలో చేసిన మాక్ డ్రిల్ విజయవంతం అయింది. ఏపీఎస్ డిఆర్ యఫ్ డి.ఎస్.పి యం.మోహనరావు యుద్ధాలు సంభవించినప్పుడు ప్రమాదాల సంభవించినప్పుడు ఏ విధంగా ప్రభుత్వ శాఖలు ఎదుర్కోవాలి ప్రజలకు సహాయం చేయాలి ప్రజలు ఎలా స్పందించాలి అనే దానిపై వివరించారు. జిల్లా ఫైర్ ఆఫీసర్ బి శ్రీనివాస్ కూడా అగ్నిప్రమాదాలు ఇతర ప్రమాదాలు సంభవించినప్పుడు ఏ విధంగా ఎదుర్కోవాలి అని దానిపై మైక్ ద్వారా తెలియజేశారు. బాంబ్ స్క్వాడ్ పోలీస్ డాగ్ సిబ్బంతో కలిసి తనిఖీలు నిర్వహించింది.కలెక్టర్ చదలవాడ నాగరాణి,జిల్లా ఎస్పీ అద్నాన్ నయామ్ అస్మిలు ఈ సందర్భంగా మాట్లాడుతూ మాక్ డ్రిల్ బాగా చేశారని భవిష్యత్తులో మరింతగా ప్రజలకు తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ వి.భీమారావు ,డిఆర్ఓ మొగిలి వెంకటేశ్వర్లు, ఆర్డిఓ ప్రవీణ్ కుమార్ రెడ్డి,తాసిల్దార్ రావి రాంబాబు,ఏపీఎస్ఆర్టీసీ డిఎం సత్యనారాయణ మూర్తి వన్ టౌన్ సీఐ నాగరాజు, ఆర్మ్డ్ ఏ ఆర్, కె.వెంకటరావు, మున్సిపల్ కమిషనర్ కే రామచంద్ర రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ వెంకటేశ్వరరావు, భీమవరం ఎంపీడీవో నూకల మురళీ గంగాధరరావు,ఎలక్ట్రికల్ ఏఈ కొత్తపల్లి రాంబాబు తదితర అధికారులు పాల్గొన్నారు.

# రైతులకు మేలు చేసేది కూటమి ప్రభుత్వం

మొదటిపేజి తరువాయి

పశువుల ఆసుపత్రి దగ్గరలో 13.27 లక్షలతో పెనుమదం నెం.2 చానెల్ త్రవ్వు పనులు,లంక వారి పేట దగ్గరలో చించినాడ చానెల్ పై 82.70 లక్షలతో సి.సి. వాల్ నిర్మాణ పనులకు, మరో 19.94 లక్షలతో చించినాడ చానెల్ త్రవ్వు పనులు, మేరీమాత గుడి దగ్గరలో చించినాడ చానెల్ పై 40 లక్షలత వంతెన నిర్మాణ పనులు, మొత్తంగా 182.27 లక్షలతో 6 పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలను కూటమి నాయకులతో కలిసి మంత్రి రామానాయుడు చేశారు. ఆయా గ్రామాల్లో మంత్రికి ఘన స్వాగతం పలికి పూల వర్షం కురిపించారు. జరుగుతున్న పనులు పట్ల రైతాంగం సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ గత జగన్ ఐదేళ్ల పాలనలో రైతులకు మేలు జరిగే పనులు జరగకపోగా కాలువల నిర్వహణను గాలికి వదిలేయడంతో తీవ్రంగా నష్టం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు తానేటి బాబురావు, సబ్బితి సుమంగళి, మానేపల్లి శ్రీధర్, గొట్టుముక్కల సూర్యానారాయణరాజు,పెనుమత్స రామభద్రరాజు, దేవరపు దొరబాబు,కడలి ఆంజనేయులు, గుమ్మపు జగజ్జీవన్ రావు కోడి విజయభాస్కర్ తదితర కూటమి నాయకులు పాల్గొన్నారు.

# సైనికుల క్షేమం కోరుతూ ఎమ్మెల్యే బొలిశెట్టి ప్రత్యేక పూజలు





**తాడేపల్లిగూడెం,మేజర్‌న్యూస్ :** భారతదేశ సరిహద్దులలో యుద్ధ భూమిలో దేశ ప్రజల కోసం పోరాడుతున్న భారత సైనికులక్షేమం కోరుతూ బుధవారం చిత్తూరు జిల్లా శ్రీకాళహస్తిలో జ్ఞాన ప్రసన్నాంబ ఈశ్వరుడిని ప్రత్యేక పూజలు, తిరుమల తిరుపతి దేవస్థానం వెంకటేశ్వర స్వామిలక ంపూజలు చేశామని రాష్ట్ర విప్ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. బుధవారం ఆయన 100 మంది నియోజకవర్గంలోని స్త్రీలు మరియు జనసేన నాయకులతో చిత్తూరు జిల్లా శ్రీకాళహస్తిలో జ్ఞానప్రసన్నాంబ ఈశ్వరుడిని, ముందుగా తిరుమల తిరుపతి దేవస్థానం పెద్ద తిరుపతి నందు ప్రత్యేక పూజలు జరిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ శాంతి కోసం నేడు దేవాలయాల్లో పూజలు నిర్వహిస్తున్నామని, భారతదేశ ప్రధాని నరేంద్ర మోడీ తీసుకున్న నిర్ణయం సరైనదని,పాకిస్తాన్ ఉగ్రవాదులు దేశ ఆడపడుచుల సింధూరాన్ని చెరిపినందుకుగాను నరేంద్ర మోడీ ధీటుగా సమాధానం చెప్పారని అన్నారు. ఈ కార్యక్రమంలో గురుజీ సూరిబాబు, పైబోయిన రఘు, పిడుగు రామ్మోహన్ బ్రదర్స్,అడ్డగర్ల సురేష్, సిద్ధ వీరన్న, అడబాల మురళి, జనసేన నాయకులు కార్యకర్తలు వీర మహిళలు పాల్గొన్నారు.

# ఉపాధి కూలీలకు ఏడాదికి 200 రోజులు పని కల్పించాలి



**– వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జార్జి డిమాండ్**

**యలమంచిలి,మేజర్ న్యూస్:** జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం లో పనిచేస్తున్న వ్యవసాయ కార్మికులకు 200 రోజులు పని కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బాతి రెడ్డి జార్జి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని శిరగాలపల్లి, పెనుమరరు గ్రామాల్లో పనిచేస్తున్న ఉపాధి కూలీల సమస్యలను బుధవారం ఆయన స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జార్జి మాట్లాడుతూ ఉపాధి పథకంలో పనిచేస్తున్న కూలీలకు ఏడాదికి 200 రోజులు పని కల్పించాలని, అలాగే కనీస వేతనం రోజుకిరూ. 600 లు అమలుచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మహాలక్ష్మి,కుమారి జి.నాగేశ్వరరావు,వి.కుమారి పికవరం బి జానకి దేవి, దావీదు మరి అమ్మ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

# సర్పంచ్ భారతి గృహప్రవేశంలో నాయకర్ దంపతులు



**నర్సాపురంరూరల్,మేజర్‌న్యూస్:** మండలంలోని రుస్తుం బాధ పంచాయతీ సర్పంచ్ బందెల భారతి నూతన గృహప్రవేశంలో రాష్ట్ర ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్ దంపతులు పాల్గొని గృహప్రవేశం చేశారు. మాజీ ఎమ్మెల్యే బండారు మాధవ నాయుడు,ఎంపీపీ మైలా బత్తుల సోనీ, కౌన్సిలర్లు కొప్పాడి కృష్ణ,తోట అరుణ, బొమ్మిడి సూర్యకుమారి, పలు గ్రామాల సర్పంచులు, జనసేన నాయకులు పాల్గొన్నారు.

# ఏపీఎంకు వివోఏలు సమ్మె నోటీస్



**నర్సాపురం,మేజర్ న్యూస్:** ఈనెల 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో పాల్గొంటున్నట్లు డ్వాక్రా విఓఏల తెలిపారు. ఈ మేరకు బుధవారం ఏపిఎం జక్కంపూడి నాగభూషణం నాయుడుకు ఆయన కార్యాలయంలో డిమాండ్‌లతో కూడిన సమ్మె నోటీసును అందజేశారు. లేబర్‌కోడ్‌ను రద్దు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ నిలుపుదల చేయాలని,కాలపరిమితి సర్క్యులర్ రద్దు, ఉద్యోగ భద్రత, కనీస వేతనం, బకాయిల చెల్లింపు తదితర డిమాండ్లతో కూడిన సమ్మె నోటీసును అందజేశారు. ఈకార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తలగం శెట్టి సత్యనారాయణ, వివిధ గ్రామాలకు చెందిన విఓఏలు పాల్గొన్నారు.

# అర్హత కలిగిన వారు ఇంటి స్థలం కొరకు దరఖాస్తు చేసుకోవాలి



**యలమంచిలి,మేజర్ న్యూస్:** గ్రామీణ ప్రాంతంలోని అర్హత కలిగిన ప్రతి కుటుంబం ఇంటి స్థలం కోసం దరఖాస్తు చేసుకోవచ్చుని దీనికి సంబంధించి ప్రభుత్వం నుండి మార్గదర్శకాలు జారీ అయినట్లు తహసీల్దార్ గ్రంధి పవన్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు ప్రభుత్వం ఇచ్చే మూడు సెంట్ల ఇంటి స్థలం కోసం దరఖాస్తు చేసుకునేవారు గతంలో ఏ ప్రభుత్వం నుండి ఎటువంటి ఇంటి స్థలం ఇల్లు పొంది ఉండకూడదని లబ్ధిదారులు బిపిఎల్ వర్గానికి చెంది తెల్ల రేషన్ కార్డు కలిగి ఉండాలని గతంలో ఇచ్చిన ఇంటి స్థలం స్మశాన వాటిక సమీపంలో గాని గ్రామానికి దూరంగా లోతట్టు ప్రాంతాలలో ఇంటి నిర్మాణానికి లబ్ధిదారులు అంగీకరించిన మునుపటి కేటాయింపులు రద్దుచేసి అదే గ్రామంలో మూడు సెంట్ల ఇంటి స్థలం పొందుటకు అర్హత పొందుతారని దీనికి సంబంధించి ఆయా గ్రామ స్థాయిలో దరఖాస్తుల స్వీకరణ జరుగుతుందని తెలిపారు.

# వీధి వ్యాపారులు డేటా ఆన్లైన్ చేయించాలి : కమీషనర్



**నరసాపురం,మేజర్ న్యూస్ :** మున్సిపల్ కమిషనర్ ఛాంబర్ లో కమిషనర్ ఎం అంజయ్య అధ్యక్షతన వీధి విక్రయదారుల సర్వే ద్వారా వారి డేటాను సేకరిం చుటకు సచివాలయం వార్డ్ వెల్ఫేర్ సెక్రెటరీ లకు అవగాహనా కార్యక్రమం బుధవారం జరిగింది. వీధి విక్రయిదారులు ఎవరైతే ఉన్నారో వారందరూ కూడా సచివాలయం సిబ్బంది వచ్చినప్పుడుఅందరుకూడా బయోడేటా లో భాగంగా రేషన్ కార్డు ,ఆధార్ కార్డు, వ్యక్తిగత పాస్పోర్ట్ ఫోటో,ఫ్యామిలీ ఫోటో అందజేయాలని కమిషనర్ కోరారు. డేటాను మీ వద్దకే వచి ఆన్లైన్ చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమం లో మున్సిపల్ టీ పి యస్ త్రినాధరావు, మెప్మా సిటీ మిషన్ మేనేజర్‌యన్ రత్నాకర్,సి వో కే. కృష్ణ ప్రసాద్, డి ఈ ఓ షణ్ముఖ దేవి, సచివాలయం వెల్ఫేర్ సెక్రెటరీ లు పాల్గొన్నారు.

# శాఖా గ్రంధాలయంలో యోగ మెడిటేషన్ పై శిక్షణ



**నరసాపురం,మేజర్ న్యూస్ :** ప్రధమ శ్రేణి శాఖ గ్రంధాలయంలో కొనసాగుతున్న వేసవి విజ్ఞాన తరగతులకు హాజరైన విద్యార్థుల చేత బుధవారం ఎన్సైక్లోపీడియాస్ విజ్ఞాన సర్వస్వాలు ,కథల పుస్తకాలు చదివించడం జరిగింది. పిల్లలు చాలా ఉత్సాహంగా పాల్గొని పో టా పోటీగా పుస్తకాలు చదువారు. రిసోర్స్ పర్సన్ గెల్లిశ్రీనివాస్ యోగాసనాలు,మెడిటేషన్, కెరీర్ గైడెన్స్, గణితంలో శిక్షణ నిచ్చారు. సిఆర్‌పి రావి కృపారావు గుడ్ హ్యాండ్ రైటింగ్ లో శిక్షణ,నాగలక్ష్మిస్పోకెన్ ఇంగ్లీష్ లో శిక్షణ, సిహెచ్ శ్రీనివాస్ చిత్ర లేఖనంలో శిక్షణఇచ్చినారు. ఈ కార్యక్రమంలో భట్టిప్రోలు సత్యనారాయణ, శాస్త్రవేత్త సుబ్బారావు, సూర్యం బాబు, సుధీర్ మోహన్ , జీ వన్ తదితరులు పాల్గొన్నారు. గ్రేడ్ వన్ లైబ్రేరియన్ కేజే ఎస్ ఎల్ కుమారి పర్యవేక్షించారు.

# ఘనంగా డిప్యూటీ స్పీకర్ రఘురామ పుట్టినరోజు వేడుకలు



**ఉండి,మేజర్‌న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఉపసభాపతి, ఉండి శాసనసభ్యులు కనుమూరి రఘురామ కృష్ణంరాజు పుట్టినరోజు వేడుకలు ఉండి మండల తెలుగు యువత అధ్యక్షుడు రుద్రరాజు దుర్గరాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రఘురామ కృష్ణంరాజు తనయుడు యువనేత కనుమూరి భరత్ విచ్చేసి పుట్టినరోజు కేకును కట్ చేసి తెలుగు యువత నాయకులకు తినిపించారు. అనంతరం నాయకులు, కార్యకర్తలు పుట్టినరోజు కేకును ఒకరికి ఒకరు తినిపించుకుంటూ తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తూ రఘురామ కృష్ణంరాజుకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా యువనేత భరత్ మాట్లాడుతూ తెలుగు యువత ఆధ్వర్యంలో రఘురామ కృష్ణంరాజు జన్మదిన వేడుకలు నిర్వహించడం అభినందనీయమని ఈ కార్యక్రమానికి తాను రావడం చాలా ఆనందంగా ఉందని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో ఉండి మండల తెలుగు యువత నాయకులతోపాటు టిడిపి సీనియర్ నాయకులు కార్యకర్తలు అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు పుట్టినరోజు సందర్భంగా ఉండి మండల తెలుగు యువత ఆధ్వర్యంలో పేదలకు అన్న సమారాధన నిర్వహించారు.

# ఇంటి స్థలాల కొరకు దరఖాస్తు చేసుకోండి :

**తాసిల్దార్ సత్యనారాయణ**



**నరసాపురం,మేజర్ న్యూస్** : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలు, జిల్లా ఉన్నతాధికారుల సూచనల మేరకు అందరికీ ఇల్లు పథకంలో భాగంగా అర్హత కలిగిన లబ్ధిదారులు ఇంటి స్థలం కొరకు దరఖాస్తు చేసుకోవాలని తాసిల్దార్ ఐ వివి సత్యనారాయణ కోరారు. గ్రామీణ ప్రాంతాలలో మూడు సెంట్లు,పట్టణ ప్రాంతాలలో రెండు సెంట్లు ఇంటి స్థలాలు కేటాయించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మార్గదర్శక నిబంధనలు విడుదల చేసిందని ఆయన తెలిపారు. బుధవారం తాసిల్దార్ కార్యాలయంలో సూర్య ప్రతినిది తో మాట్లాడారు. అర్హత గల లబ్ధిదారుల నుండి దరఖాస్తులను గ్రామ సచివాలయంలో అందజేయవలసినదిగా ఆయన కోరారు. ఆన్లైన్ చేసిన నాటినుండి పది సంవత్సరాల అనంతరం ఫ్రీ ఓల్డ్ హక్కులు కల్పిస్తూ కన్వెయాన్స్ డేడ్ మంజూరు చేయవలనని, అర్హత కలిగిన లబ్ధిదారునికి జీవితంలో ఒకసారి మాత్రమే ఇంటి స్థలం మంజూరు చేయబడుతుందని ఆయన తెలిపారు. ఇంటి స్థల పట్టా,కన్వియన్స్ డిడ్ మంజూరు తేదీ నుండి లేదా గృహ నిర్మాణ ఆమోద తేదీ నుండి రెండు సంవత్సరాలు లోపు ఇల్లు నిర్మించుకోవాలని, ఆధార్, రేషన్ కార్డుతో అనుసంధించాలని ఆయన కోరారు. లబ్ధిదారుడు బిపిఎల్ వర్గానికి చెందిన వాడై రాష్ట్రంలో ఎక్కడైనా ఇంటి స్థలము లేదా ఇల్లు కలిగి ఉండకూడదని ఆయన తెలిపారు. గతంలో ఏ ప్రభుత్వ పథకం కింద ఇల్లు లేదా స్థలము పొంది ఉండకూడదని,లబ్ధిదారుడు రాష్ట్ర,కేంద్ర ప్రభుత్వ మునుపటి ఏ గృహ నిర్మాణ పథకములోనూ చేర్చబడి ఉండకూడదని ఆయన తెలిపారు. ఇతర సమాచారం కొరకు గ్రామ సచివాలయాల యందు డిఇఓ, సిబ్బందిని అడిగి తెలుసుకోవాల్సినదిగా తాసిల్దార్ సత్యనారాయణ తెలిపారు.

## నర్సాపురం మున్సిపల్ కమిషనర్‌కు పదోన్నతి



**నర్సాపురం,మేజర్‌న్యూస్** : ఉద్యోగధర్మాన్ని పాటిస్తూ, ప్రజాసేవలో జవాబుదారితనాన్ని వహిస్తున్న మునిసిపల్ కమిషనర్ ఎం.అంజయ్య గ్రేడ్ 2 నుండి గ్రేడ్ 1 కమిషనర్‌గా ప్రమోషన్ పొందిన సందర్భంగా సచివాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం పుష్పగుచ్ఛం అందించారు. ఈసందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులుగా సచివాలయ సిబ్బంది బాధ్యతతో కూడిన ఉత్తమమైన సేవలు ప్రజలకు అందించటంలో నిరంతరం కృషి చేయాలని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ గ్రామ వార్డు సచివాలయం ప్రభుత్వ ఉద్యోగుల సంఘం,నర్సాపురం పట్టణ కమిటీ అధ్యక్షులు టి.సుబ్బలక్ష్మి, సెక్రెటరీ పులఖండం వాసు, జాయింట్ సెక్రెటరీ కూనా ప్రభూజీ, ట్రెజరర్ కృష్ణ వంశీ,నాయకులు,ఎం చంద్రకళ ఎం నరేష్ కె సత్య శాంతి,యు.మౌనిక శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు.

## ఆర్థిక ఇబ్బందులు,బ్యాంక్ వారి ఒత్తిడితో ఆటో డ్రైవర్ ఆత్మహత్య



**ఏలూరు,మేజర్ న్యూస్** : ఓవైపు ఆర్థిక ఇబ్బందులు మరోవైపు బ్యాంక్ అధికారుల ఒత్తిడితో మనస్థాపానికి గురైన ఆటో డ్రైవర్ బుధవారం బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఏలూరు రూరల్ మండలం మెరక కాట్లంపూడి గ్రామానికి చెందిన నంబూరు అశోక్ కుమార్ (37) భార్య ఇద్దరు పిల్లలతో కలిసి ఆటో నడుపుకుంటూ జీవిస్తున్నాడు. ఇంటి నిర్మాణం నిమిత్తం బ్యాంకులో అప్పు చేసాడు. అప్పు చెల్లించకపోవడంతో బ్యాంక్ అధికారులు ఒత్తిడి తెచ్చారు దీంతో బుధవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## చెక్ బౌన్స్ కేసులో జైలు శిక్ష , రూ.4 లక్షల జరిమానా

**ఏలూరు,మేజర్ న్యూస్** : ఏలూరు నగరానికి చెందిన ఎన్ రమేష్ బాబు దగ్గర దేవాదాయ శాఖలో ఉద్యోగం చేసే తిరుమల పెద్దింటి మాధవి 2019 జూన్ 7న తన కుటుంబ అవసరాల నిమిత్తం ప్రోనోట్ ద్వారా 3లక్షల రూపాయలు అప్పుగా తీసుకుని చెల్లని చెక్కు ఇచ్చిన కేసులో మాధవి కి సంవత్సరం జైలు శిక్ష ,4 లక్షలు జరిమానా కోర్టు విధించింది. రమేష్ బాబుకు పార్టు పేమెంట్ గా 2020 డిసంబర్ 31న తేదీన 2 లక్షల రూపాయలకు చెక్కు ఇవ్వగా పెద్దింటి తిరుమల మాధవి బ్యాంకు ఖాతాలో సరిపడా డబ్బులు లేనందున చెక్కు చెల్లకుండా పోయింది. వెంటనే ఎన్ రమేష్ బాబు కోర్టులో పెద్దింటి తిరుమల మాధవి ఉద్దేశం పూర్వకంగానే చెల్లని చెక్కు ఇచ్చినదని కోర్టులో కేసు వేయడంతో కోర్టు విచారించి చెక్ బౌన్స్ కేసులో నేరం రుజువు కావడంతో బుధవారం ఏలూరు జిల్లా కోర్టులోని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్ కె మహ్మద్ అబుతాలీబ్ పర్వేజ్ పెద్దింటి తిరుమల మాధవికి సంవత్సరం జైలు శిక్ష పిర్యాదు దారుడైన ఎన్ రమేష్ బాబుకు 4 లక్షల రూపాయలు పరిహారంగా చెల్లించమని తీర్పు చెప్పారు. ఫిర్యాది తరుపున ప్రముఖ న్యాయవాది చిక్కా భీమేశ్వర రావు వాదించారు.

## స్వర్ణాంధ్రలో ఎన్‌సిసి శిక్షణ ప్రారంభం



**నరసాపురంరూరల్,మేజర్‌న్యూస్:** ఎన్‌సిసిలో కొనసాగుతూఏబిసి సర్టిఫికెట్లు పొందగోరు విద్యార్థులు, రిపబ్లిక్ డే పీరియడ్‌కు హాజరు కాగోరు వారికి మండలంలోని సీతారాంపురంలో గల స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో సెలక్షన్,శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఉమ్మడి తూర్పు,పశ్చిమ గోదావరి జిల్లాల నుండి 211 మంది హాజరయ్యారు. 10రోజులపాటు ఈ కార్యక్రమం కొనసాగుతుందని క్యాంపు కమాండెంట్, లెఫ్టినెంట్ కమాండర్ సి రోహిత్ కుమార్ తెలిపారు. 6 కళాశాలలు, మూడు హై స్కూల్స్ నుండి విద్యార్థులు హాజరవుతున్నారని, పది రోజులు జరిగే ఈ కార్యక్రమంలో ఫైరింగ్, స్విమ్మింగ్, డ్రిల్, సాంస్కృతిక కార్యక్రమాలలో శిక్షణ ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంఐ మామిళ్ళ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## నేత్ర పర్వంగా వసంతోత్సవం



**ద్వారకాతిరుమల,మేజర్ న్యూస్:**ద్వారకాతిరుమల చిన్న వెంకటేశ్వర స్వామి వారి వైశాఖమాస తిరు కళ్యాణ మహోత్సవములు ఆఖరి రోజు కావ డంతో చువర్ణోత్సవం, వసంతోత్సవం,ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆలయంలో పడమర గోపురం వద్ద రాజాధి వాహనంపై స్వామి అమ్మవార్ల నుంచి అర్చకులు పూజలు నిర్వహించి హారతులు ఇచ్చారు.అనంతరం గ్రామ పురవీధులలో గజ,అశ్వముతో మేళ తాళాలు మంగళ వాయిద్యాలు నడుమ గ్రామోత్సవాన్ని నిర్వహించారు. భక్తులు స్వామివారి కి టెంకాయలు సమర్పించి హారతులు అందుకున్నారు.అర్చకులు భక్తులపై వసంతాన్ని తిలకించారు. సాయంత్రం7గంటలకుద్వాదశ కోవెల ప్రదక్షిణలు ,శ్రీ పుష్పయాగంతో ఉత్సవాలు పరి సమాప్తం అవుతాయి.

## ఆసుపత్రి పై ఫిర్యాదులు రాకుండా చూసుకోండి : ఎమ్మెల్యే బాలరాజు





**బుట్టాయిగూడెం,మేజర్‌న్యూస్** : ప్రభుత్వఆసుపత్రిపై ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అన్నారు. స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం సాయంత్రం ఆకస్మికంగా సందర్శించారు. ఆసుపత్రిలోని అన్ని వార్డులు తిరిగి రోగులకు అందుతున్న వైద్య సేవలపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలోని వివిధరికార్డులను పరిశీలించారు. ఆసుపత్రి అభివృద్ధిపై వివరాలు వాటికి సంబంధించిన ఖర్చులను అడిగి తెలుసుకున్నారు. ఈఆసుపత్రిపైచాలాఫిర్యాదులు వస్తున్నాయనిభవిష్యత్తులో ఇటువంటి రాకుండా చూసుకోవాలని సిబ్బందికి సూచించారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి సూపర్ డిటండెంట్‌డాక్టర్ వసుంధర వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

# 'మాయింట్లో పెళ్ళికి' రండి

**– జగన్ ని ఆహ్వానించిన బూత్ కమిటీల అధ్యక్షులు చింతా అనిల్**



**జంగారెడ్డిగూడెం,మేజర్ న్యూస్:** నాయకులు, కార్యకర్తలే పార్టీకి పెట్టని కోట అని వారి అభిమానానికి కొలబద్ద అంటూ ఏదీ లేదని మాజీ ముఖ్య మంత్రి, వైఎస్ఆర్‌సీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం వైసిపి ఏలూరు జిల్లా బూత్ కమిటీల అధ్యక్షుడు చింతా అనిల్ కుమార్ గౌడ్ తమ బావ మరిది సుభాష్ వివాహ శుభలేఖను తాడేపల్లి లోని జగన్ మోహన్ రెడ్డి క్యాంప్ కార్యాలయానికి వెళ్లి అందించారు . పెళ్ళికి రమ్మని సాదరంగా ఆహ్వానించారు.అనిల్ కుటుంబసభ్యులు కూడా ఆయనతో వున్నారు. ఈసందర్భంగా జగన్ రెడ్డి జిల్లాలో పార్టీ పరిస్థితులు అడిగి తెలుసు కున్నారు. ప్రజల్లో వైసీపీ పట్ల ప్రేమాభిమానాలు చెక్కు చెదరలేదని,ఎన్నికల్లో ఇచ్చిన హామీలు చేసిన వాగ్దానాలు ఎప్పుడు అమలు చేస్తారని కూటమి నేతల్ని నిలదీస్తుంటే సమాధానం చెప్పలేని వాతావరణ అన్ని ప్రాంతాల్లో కని పిస్తున్నదని అనిల్ గౌడ్ వివరించారు. కోవిడ్‌లో కూడా జగనన్న మాట తప్పలేదు.. మడమతిప్పలేదని ఎంతటి ఇబ్బంది వున్నా బటన్ నొక్కి తన హామీలు నేరవేర్చారని ఏడాది తీరకుండా ప్రజలు ప్రస్తుత ప్రభుత్వం తీరును ప్రజలు ఎండ గడుతున్నారని వివరించారు. అంతా మంచే జరుగుతుంది. రానున్నది మన ప్రభుత్వమేనని జగన్ ధీమా వ్యక్తం చేశారు. అనిల్ తో పాటు వరుడు తండ్రి తాడువాయి సొసైటీ మాజీ అధ్యక్షుడు వీరంకి సత్యనారాయణ, పెళ్లి కుమారుడు సుభాష్ తదితరులు వున్నారు.

# రూ.45 లక్షలతో కొనుగోలు చేసిన వాహనాల ప్రారంభం



**ఏలూరు,మేజర్ న్యూస్ :** మున్సిపల్ కార్పొరేషన్ కు చెందిన 15 వ ఆర్థిక సంఘం నిధులు 46 లక్షల రూపాయలతో నూతనంగా కొనుగోలు చేసిన మీడియం సైజ్ కంపెక్టర్‌ను మేయర్ నూర్జహాన్ పెదబాబు జండా ఊపి ప్రారంభించారు. బుధవారం ఉదయం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో నూతనంగా కొనుగోలు చేసిన కంపెక్టర్ మేయర్ నూర్జహాన్ పెదబాబు ప్రారంభించారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూశాసనసభ్యులు బడేటి రాధాకృష్ణయ్య ఆదేశాలతో ఏలూరు నగరపాలక సంస్థ పరిధిలో పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక దృష్టి సారించడం జరిగిందన్నారు. పారిశుద్ధ్య పనులు మెరుగుపరిచే చర్యల్లో భాగంగా సర్కిల్స్ వారీగా అవసరమైన పనిముట్లను గుర్తించి వాటిని కార్పొరేషన్ సంబంధించిన వివిధ రకాల నిధులతో కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. అందులో భాగంగా మున్సిపల్ కార్పొరేషన్ కి చెందిన 15వ ఆర్థిక సంఘం నిధులు 46 లక్షల రూపాయలతో మీడియం సైజ్ కంపెక్టర్ కొనుగోలు చేసి ఈరోజు ప్రారంభించడం జరిగిందన్నారు.నగరపాలక సంస్థ పరిధిలో ఉన్న 50 డివిజన్లలో 16 సర్కిల్స్‌లో ఉన్న చెత్తను డంపింగ్ యార్డ్ కి తరలించడానికి 17 ట్రాక్టర్లు,8 కంపెక్టర్లు ఉపయోగిస్తున్నామన్నారు.అంతేకాకుండా డోర్ కలెక్షన్ కు సంబంధించి సరిపడాసిబ్బంది. వారికి సరిపడా పుష్ కార్ట్స్,డస్ట్ బిన్స్,డంపర్ బాక్సులు ఉన్నాయని మేయర్ నూర్జహాన్ పెదబాబు అన్నారు. నగరపాలక సంస్థ కమిషనర్ ఏ.భాను ప్రతాప్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చాక చెత్త పన్ను వసూలు చేయడం మానేశామన్నారు. అయితే అప్పుడు ఉపయోగించిన క్లాప్ వాహనాలు కారణంగా నెలకు 40 లక్షల రూపాయలు అధికంగా మున్సిపల్ కార్పొరేషన్ కు భారమవుతుందన్నారు.అందువలన క్లాప్ వెహికల్స్ ఆపేసామన్నారు. వాటి స్థానంలోమున్సిపల్ కార్పొరేషన్ కి సంబంధించిన ఆర్థిక సంఘం నిధులతో 15 కొత్త ట్రాక్టర్లు కొనుగోలు చేస్తున్నామన్నారు. శాసనసభ్యులు బడేటి రాధాకృష్ణయ్య నగరపాలక సంస్థ మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు సహకారంతో స్వచ్ఛ్ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభితో మాట్లాడి ప్రైవేట్ ఏజెన్సీ ద్వారా ఆచెత్తను అక్టోబర్ 2 వ తేదీ నాటికి క్లియర్ చేయడానికి చర్యలు తీసుకుంటున్నామనీ కమిషనర్ అన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ జి.చంద్రయ్య,డిప్యూటీ కమిషనర్ శివారెడ్డి,ఎం ఈ సురేంద్రబాబు,డిఈ రజాక్,ఏఈ సాయి, సూపరిండెంట్ శీరాజుద్దీన్,డిప్యూటీ మేయర్ వందనాల దుర్గ భవాని శ్రీనివాస్,కార్పొరేటర్ సబ్బన శ్రీనివాసరావు,పలువురు శానిటరీ ఇన్స్పెక్టర్లు,మేస్త్రీలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఫేజ్ -1 రీసర్వే ఈ నెలాఖరికి పూర్తి చేయాలి



### – గెజిట్ నోటిఫికేషన్ విడుదలకు చర్యలు తీసుకోవాలి : జేసి

**భీమవరం,మేజర్ న్యూస్ :** బుధవారం భీమవరం జాయింట్ కలెక్టర్ ఛాంబర్ నందు జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి రీ సర్వే, పిజిఆర్ఎస్, అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల స్థలాల కేటాయింపు, తదితర అంశాలపై గూగుల్ మీ ద్వారా ఆర్డీవోలు,తహసిల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, సర్వే అధికారులతో సమీక్షించారు. రి సర్వేపై సమీక్షిస్తూ జిల్లాలో ఫేజ్ -1లో ఉన్న గ్రామాలలో రీసర్వే మే నెలాఖరి నాటికి పూర్తిచేసి గెజిట్ నోటిఫికేషన్ విడుదలకు చర్యలు తీసుకోవాలన్నారు. అలానే ఫేజ్ 2 రిసర్వే పనులను వేగవంతం చేయాలన్నారు. పి జి ఆర్ ఎస్ దరఖాస్తులపై సమీక్షిస్తూ రెవిన్యూకు సంబంధించిన పిటిషన్లు పరిష్కరించే సమయంలో అవగాహనతో పరిశీలించి నిబంధనలు ప్రకారం చర్యలు తీసుకోవాలని అన్నారు. పిజిఆర్ఎస్ సమస్యల పరిష్కారంలో ఏ ఐ టెక్నాలజీని ఉపయోగించడం జరుగుతుందని తద్వారా సమస్యలు నాణ్యతతో పరిష్కరించుకోవచ్చని అన్నారు. జిల్లాలో అందరికీ ఇళ్ళు పథకం కింద గ్రామీణ ప్రాంతాలలో 3 సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు భూమిని కేటాయించేందుకు మార్గదర్శకాలతో ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేయడం జరిగిందని అన్నారు. అర్హత గల లబ్ధిదారులు సచివాలయాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో డిఆర్ఓ మొగిలి వెంకటేశ్వర్లు, జిల్లా గ్రామ వార్డు సచివాలయం అధికారి వై దోసిరెడ్డి, జిల్లా ఇంచార్జ్ సర్వే అధికారి కె .శ్రీనివాస్, కలెక్టరేట్ సూపర్డెంట్ సి హెచ్ రవికుమార్, డిప్యూటీ తహసిల్దార్ ఎం.సన్యాసిరావు, తదితరులు పాల్గొన్నారు.

# 20న ఉపాధి హామీ పనుల బంద్ చేయాలి



**పెదవేగి,మేజర్ న్యూస్ :** 20న దేశవ్యాప్త సమ్మెలో భాగంగా ఉపాధి హామీ పరిరక్షణ కోసం ఉపాధి హామీ పనుల బంద్ చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయకార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏ.రవి పిలుపునిచ్చారు. విజయరాయిలోని ఉపాధికార్మికులను కలుసుకొని సమస్యలు అడిగి తెలుసుకున్నారు పేదలకు గ్రామీణ పేదలకు పట్టడం పెడుతున్న ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వీర్యం చేస్తున్నాయని విమర్శించారు వేతన బకాయిలు ఇవ్వకపోవడం నిధులు తగ్గించడం పనిముట్లు ఇవ్వకపోవడం వంద రోజులు పనులు కల్పించకపోవడం తదితర రూపాల్లో పథకాన్ని నిర్వీర్యం చేస్తుందన్నారు ఉపాధి కార్మికులకు 200 రోజులు పనిదినాలు కావాలని సమ్మర్ అలవెన్స్ ఇవ్వాలని , 600 వందలు రూపాయలు వేతనాలు ఇవ్వాలని అడిగిన వారందరికీ జాబ్ కార్డ్,పని ఇవ్వాలని డిమాండ్ చేశారు. మే 20న జరిగే దేశవ్యాప్తసమ్మెలో ఉపాధి కార్మికులు కూడా సమ్మెలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు ఐదు వారాలగా వేతన బకాయిలు చెల్లించకపోవడం వల్ల తాము తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని ఉపాధి కూలీలు వాపోయారు తక్షణం ఉపాధి వేతనబకాయిలు విడుదల చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్రకమిటీ సభ్యులు అస్కర అప్పలస్వామి ఐద్వా జిల్లా కార్యదర్శి ఏ.శ్యామలరాణిలు డిమాండ్ చేశారు. వేతనాలు నెలలు తరబడి ఇవ్వకపోతే రెక్కల కష్టంపై ఆధారపడి జీవించేవారు ఏరకంగా బ్రతుకుతారనే కనీసఆలోచన కూడా ప్రభుత్వానికి లేకపోవడం దుర్మార్గమన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం గ్రామ నాయకులు రౌతు ఎల్లమ్మ,చింతల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## పింఛన్ సమస్యలను వెంటనే పరిష్కరించాలి

### – జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ



**ఏలూరు,మేజర్ న్యూస్ :** ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ జిల్లా పరిషత్ క్యాంపు కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి డిఆర్డిఏ , డ్వామా పీడీలు విజయరాజు,కె.వెంకట సుబ్బారావు హాజరయ్యారు.పింఛన్ లబ్దిదారులు ఎదుర్కొంటున్న సమస్యలపై అధికారులతో జెడ్పి చైర్ పర్సన్ పద్మశ్రీ సమీక్షించారు. చైర్‌పర్సన్ సంబంధిత అధికారులకు సూచిస్తూ, పింఛన్ ప్రక్రియలో తలెత్తుతున్న సమస్యలను వెంటనే పరిష్కరించాల్సిన అవసరముందని స్పష్టంచేశారు. అదేవిధంగా ఉపాధిహామీ పథకం అమలుపై సమీక్షిస్తూ వేసవికాలాన్ని దృష్టిలో ఉంచుకొని శ్రామికుల పని ప్రదేశాల్లో తగిన సౌకర్యాలు కల్పించాలని,శ్రామికులకు తాగునీరు, నీడ, వైద్య సౌకర్యాలు వంటి ప్రాథమిక అవసరాలు తప్పకుండా ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు.కార్యక్రమంలో పలువురు జిల్లా అధికారులు, సంబంధిత శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ముగ్గురు యువకుల మృతిపై మంత్రి పార్థసారథి దిగ్భ్రాంతి

**నూజివీడు,మేజర్ న్యూస్ :** కాలకృత్యాల కోసం కోసం చెరువు వద్ద దిగి ముగ్గురు యువకుల మృతి చెందడంపై రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. బాధిత కుటుంబాలకు తన సానుభూతి వ్యక్తంచేశారు. ప్రభుత్వపరంగా ఆదుకుంటామని వెల్లడించారు.ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. భీమడోలు మండలంలోని పెదలింగంపాడులో వేడుకకు హాజరై తిరుగు ప్రయాణంలో కాలకృత్యాల కోసం కోమటిగుంట చెరువు వద్ద ఆగి భీమడోలు మండలం కోమటిగుంట చెరువులో ప్రమాదవశాత్తు పెదవేగి మండలం వేగివాడ గ్రామానికి చెందిన అజయ్ (28), అభిలాష్ (16), సాగర్ (16) మునిగి ముగ్గురు మృతి చెందడం పై మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు.

## వార్తా పత్రికలు చదవడం అలవాటు చేసుకోవాలి



**ఏలూరు,మేజర్ న్యూస్ :** జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు ఎంతో వినోదాత్మకంగా 14వ రోజుకు చేరుకున్నాయి. బుధవారం ఉదయం గ్రంథాలయ సిబ్బంధి బివియస్.లక్ష్మి విద్యార్ధులచేత నీతికథల పుస్తకాలను చదివించారు. కథల్లోని నీతిని విద్యార్ధుల చేత వివరించారు. అనంతరం రిసోర్స్ పర్సన్ఎమ్.ఆషా విద్యార్ధులకు ఇంగ్లీష్‌లో క్రమశిక్షణతో ఎలా మెలగాలి,జ్ఞాపకశక్తి మెరుగు పరిచే విధంగా ఆటలు ఆడించారు. అనంతరం రిసోర్స్ పర్సన్ డి. శ్రీవల్లి విద్యార్ధులకు యోగా క్లాసులు క్విజ్ పోటీలు ,వార్తా పత్రికలపై అవగాహన కల్పిస్తు వ్యకృత్వం పోటీలు నిర్వహించారు. భవిష్యత్తులో మీరందరుఎంతోఉన్నత స్థాయి కి చేరాలంటే వార్తా పత్రికలు చదవడంఅలవాటు చేసుకోవాలి.తరచు గ్రంథాల యానికి రావడం అలవాటు చేసుకోవాలి అని అన్నారు. ఈ కార్యక్రమములో డిప్యూటీ లైబ్రేరియన్ ఎ.నారాయణరావు, అసిస్టెంట్ లైబ్రేరియన్ విటిసందీప్ కుమార్,ఎమ్ డి.అస్లాం పాషా, విద్యార్ధులు, తధితరులు పాల్గొన్నారు.

# 20న కార్మిక సంఘాల సార్వత్రిక సమ్మెలో పాల్గొనాలి

**– ఏఐటియుసి ఏరియా అధ్యక్షులు కే కృష్ణమాచార్యులు**



**ఏలూరు,మేజర్‌న్యూస్** : స్థానిక స్ఫూర్తి భవనంలో ఏలూరు ఏరియా ఏఐటియుసి అనుబంధ సంఘాల అధ్యక్ష,కార్యదర్శుల సమావేశం ఏఐటియుసి ఏరియా అధ్యక్షులు కే కృష్ణమాచార్యులు అధ్యక్షతన బుధవారం జరిగింది. ఈసమావేశంలో కృష్ణమాచార్యులు,ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు ఆర్.శ్రీనివాస్‌డాంగే,జిల్లా ఉపాధ్యక్షుడు బండి వెంకటేశ్వర రావు, ఏలూరు ఏరియా కార్యదర్శి ఏ అప్పలరాజు ఏలూరు పట్టణ జట్లు, లాగుడు బండ్ల కార్మిక సంఘం అధ్యక్షులు పుప్పాల కన్నబాబు, జిల్లా నాయకులు పి. కిషోర్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి భజంత్రీ శ్రీనివాస్ లు మాట్లాడుతూ బిజెపి (ఎన్ డి ఏ) ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తుందని విమర్శించారు. బిజెపి అధికారంలోనికి వచ్చాక కొత్తగా ప్రభుత్వ రంగ సంస్థలు ఏమి ఏర్పాటు చేయకపోగా, ప్రభుత్వ రంగసంస్థలను అన్నింటిని ప్రైవేటీకరణచేస్తుందని విమర్శించారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా నాయకులు డి. లక్షణమూర్తి ఆశ్రమం మెడికల్ కాలేజ్ హాస్పిటల్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ఎస్ సురేష్ కుమార్ ఆది నరేష్ ,విజయ్ ఏపీ ప్రభుత్వ మెడికల్ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ యూనియన్ నాయకులు పిహరీష్,భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు చంద్రశేఖర్ (బుజ్జి),ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు యలగాడ శివకుమార్,టుబాకో వర్కర్స్ యూనియన్, పంచాయతీ వర్కర్స్‌యూనియన్‌ల నాయకులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని యువకుడి మృత దేహం లభ్యం





**కైకలూరు,మేజర్ న్యూస్**, కైకలూరు టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గల కైకలూరు నుంచి కోరుకొల్లు వైపు వెళ్ళు మెయిన్ రోడ్డు పక్కన ఆచవరం రైల్వే గేట్ దాటిన తర్వాత ఉన్న బాలేశ్వర ఐస్ ఫ్యాక్టరీ కి కొంచెం పక్కన కరేటి వెంకటేశ్వరావు ఖాళీ స్థలంలో ఒక గుర్తు తెలియని మృతదేహం వయసు 25 నుంచి 30 సంవత్సరాలు మధ్య వయసు గల వ్యక్తి శవమును పోలీసులు గుర్తించారు. చుట్టుపక్కల విచారించగా ఎవ్వరో తెలియదు కానీ అతనికి ఫిట్స్ రాగా చుట్టుపక్కల వారు చూసి అతని వివరాలు అడుగగా సరైన సమాచారం ఇవ్వకుండా పిచ్చిపిచ్చిగా మాట్లాడినట్లు కొంతసేపటికి ఖాలి స్థలంలోకి వెళ్లి స్పృహ తప్పి పడిపోయినట్లు తెలిపారు. అనంతరం 108కి కాల్ చేయగా వారు వచ్చి పరీక్షించి చనిపోయినట్టుగా తెలిపారు. అతను తెలుగు మాట్లాడతాడు. వ్యక్తి చామన ఛాయ రంగులో ఉండి బ్లూ రంగు టీ షర్ట్ ,బ్లూ రంగు షార్ట్ ధరించి ఉన్నాడు. అతని కుడి చెయ్యి మీద 'అమ్మ' అని పచ్చబొట్టు ఉన్నది. ఈ వ్యక్తిని గుర్తించినచో పోలీసులకు తెలియజేయాలని కోరారు.

## 16న రంగాపురం సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ నిలిపివేత

**లింగపాలెం,మేజర్ న్యూస్** : లింగపాలెం మండలం, ధర్మాజీగూడెం 132 కె.వి సబ్ స్టేషన్ క్రొత్త లైన్లు ఏర్పాటు కొరకు 16వ తేదీ శుక్రవారం ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు రంగాపురం సబ్ స్టేషన్ పరిధిలో గల 11కె.వి. పోచవరం ఫీడర్,11కె.వి.రంగాపురం హెడ్ క్వార్టర్ ఫీడర్ లకు విద్యుత్ నిలుపుదలవేయును, కనుక విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్,ఆపరేషన్ కె.ఎం అంబేద్కర్ ఒక ప్రకటనలో తెలిపారు.

## గర్భిణీ స్త్రీ మృతికి కారకులైన వైద్యులపై చర్యలు తీసుకోవాలి

**– ఎన్.ఎఫ్.ఐ. డబ్ల్యూ.అధ్యక్ష ,కార్యదర్శులు శ్యామల,యామిని**



**ఏలూరు,మేజర్ న్యూస్** : పోలవరం ప్రభుత్వ ఆసుపత్రిలో గర్భిణీ స్త్రీ మృతికి కారకులైన వైద్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య (ఎన్.ఎఫ్.ఐ. డబ్ల్యూ ) ఏలూరు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వరక శ్యామల, మన్నవ యామిని బుధవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.పోలవరం మండలంలో కొత్త కుంకాల గ్రామానికి చెందిన శిరీష మంగళవారం రాత్రి నొప్పులు రావడంతో పోలవరంలోని సామాజిక ఆరోగ్య ఆసుపత్రికి తీసుకువస్తే డాక్టర్ల అందుబాటులో లేకపోవడంతో డ్యూటీలో ఉన్న నర్సు పరీక్షలు చేశారని సకాలంలో డాక్టర్ ను పిలిచి మెరుగైన వైద్యం అందించడంలో ఆసుపత్రిలో ఉన్న సిబ్బంది నిర్లక్ష్యం వహించారని ఆరోపించారు. సకాలంలో వైద్యం అందని కారణంగా తెల్లవారుజామున గర్భిణి మృతి చెందడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు.మృతి చెందిన శిరీషకుటుంబానికి రూ.25 లక్షలు ఎక్స్‌గ్రేషియాల్ చెల్లించి ఆర్థికంగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

# 16న కార్మిక సంఘాల ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ




**ఏలూరు,మేజర్‌న్యూస్** : దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ 16వ తేదీ శుక్రవారం సాయంత్రం 4.30 గంటలకు ఏలూరు నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద నుండి కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జరుగుతున్న బైక్ ర్యాలీలో ఉద్యోగులు కార్మికులు పాల్గొనాలని ఏఐటియుసి ఏలూరు జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస్ డాంగే, జిల్లా ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు, ఏలూరు ఏరియా కార్యదర్శి ఏ అప్పలరాజు ఏఐటీయూసీ నాయకులు పి కిషోర్ పిలుపునిచ్చారు. నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని , ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించవద్దని, అవుట్సోర్సింగ్ మరియు కాంట్రాక్ట్ ఉద్యోగ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని,నిత్యా వసర వస్తువుల ధరలను నియంత్రించాలని డిమాండ్ చేస్తూ 20వ తేదీన కేంద్ర కార్మిక సంఘాలు ఇచ్చిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ బుధవారం స్థానిక ఆర్ఆర్ పేటవద్ద దిజోనల్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐటియుసి) ఆధ్వర్యంలో ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ప్రచార కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు పోలా వెంకట భాస్కరరావు, దిజోనల్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ సహాయకార్యదర్శి డి.వెంకటేశ్వరరావు,కోశాధికారిబి.నారాయణరావు, యూనియన్ నాయకులు నారాశ్రీను,డి.అప్పారావు, సింహాచలం, వెంకట రామయ్య తదితరులు పాల్గొన్నారు.

## నేడు చాట్రాయిలో ప్రజావేదిక : మంత్రి కొలుసు పార్థసారథి



**నూజివీడు/చాట్రాయి,మేజర్ న్యూస్** : చాట్రాయి మండలంలోని సమస్యలు పరిష్కరించేందుకే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని చాట్రాయిలో ఈ నెల 15వ తేదీ గురువారం మధ్యాహ్నం 3గంటలకు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ సమాచార సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. మండలంలోని ప్రజలు తమ సమస్యలు పరిష్కరించుకునేందుకు ప్రజావేదికను సద్వినియోగం చేసుకోవాలనీ ఆయన కోరారు. ప్రజావేదిక కార్యక్రమంలో నూజివీడు సబ్ కలెక్టర్ బి స్మరణ రాజ్, వివిధ శాఖల అధికారులు పాల్గొంటారన్నారు.

## ఆగిరిపల్లి టౌన్ టీడీపీ అధ్యక్షులుగా పామర్తి ఏకగ్రీవం





**ఆగిరిపల్లి,మేజర్ న్యూస్:** ఆగిరిపల్లి టౌన్ తెలుగుదేశం పార్టీ కమిటీ అధ్యక్షులుగా రెండవసారి పామర్తి నరసింహారావును, ప్రధాన కార్యదర్శిగా సగుర్తి లక్ష్మణరావుని మంగళవారం ఆగిరిపల్లి టౌన్ టిడిపి కుటుంబ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు టీడీపీ గ్రామ కమిటీ ఎన్నికల పరిశీలకులు, నూజివీడు వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ ప్రకటించారు. ఈ సందర్భంగా పామర్తి మాట్లాడుతూ తనపై నమ్మకంతో రెండోసారి టౌన్‌టీడీపీ అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు గ్రామ టిడిపి కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు తెలుపుతూ పార్టీ బలోపేతానికి తన శక్తిమేరకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పరిశీలకులుగా నూజివీడు వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ, తుమ్మల ఆది,బత్తుల మాధవరావు,సీనియర్ టీడీపీ నాయకులు మడుపల్లి గోపాల్,ఎస్ ఎస్ బాబు,చౌటుపల్లి విక్టర్ బాబు,బెజవాడ ముత్యాలు,సన్నాల సాంబశివరావు, షేక్ చాన్ బాషా, తదితర తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మహిళను కాపాడిన పెదపాడు పోలీసులు



**పెదపాడు,మేజర్‌న్యూస్** : డయల్ –112 ద్వారా కాల్ రావడంతో ఏలూరు కంట్రోల్ రూమ్ సిబ్బంది పెదపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని ఏపూరు గ్రామం వద్ద ఒక మహిళ ఆత్మహత్యకు ప్రయత్నించిందని సమాచారం అందిన వెంటనే స్పందించిన డయల్ – 112 సిబ్బంది. పెదపాడు పోలీస్ స్టేషన్ ఎస్ఐ కట్టా శారదా సతీష్‌కి సంఘటనా వివరాలు అందించి వెంటనే పెదవేగి ఇన్స్పెక్టర్ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఎస్ఐ,హెడ్ కానిస్టేబుల్ పి వీరబాబు స్థలానికి చేరుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మహిళను కాపాడారు. ఆమె వివరాలు సేకరించగా రెమిమెకాలా నాగేశ్వరమ్మ భర్త రంగారావు,వయస్సు 55 సంవత్సరాలు. ఏపూరు గ్రామానికి చెందినవారిగా గుర్తించారు. ఆమె కుమార్తె కలాం లక్ష్మి ఏపూరు గ్రామానికి బాధితురాలిని ఆమె కుమార్తెకు అప్పగించారు.

# మోసం కేసు చేధించిన టి.పి.గూడెం పోలీసులు



**తాడేపల్లిగూడెం,మేజర్‌న్యూస్ :** తాడేపల్లిగూడెం పట్టణానికి చెందిన పోపూరి సాంబశివ ప్రసాద్ వయస్సు 73, కొబ్బరితోట ప్రాంత నివాసి, ఫోన్ ద్వారా అక్రమ రవాణా కేసులో ముద్దాయిగా ఉన్నారని భయపెట్టబడగా దాంతో అతను డిజిటల్ అరెస్టుకు గురయ్యాడు. నిందితులు అతనిని మోసగించి మొత్తం రూ.50 లక్షల నగదును రెండు బ్యాంక్ ఖాతాల ద్వారా ఆర్‌టిజిఎస్ మార్గంలో బదిలీ చేయించుకున్నారు. ఈ కేసును పోలీసులు చేధించారు. కాగా పోపూరి సాంబశివ ప్రసాద్ ఈ మోసాన్ని గ్రహించి వెంటనే తాడేపల్లిగూడెం టౌన్ పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించగా, పశ్చిమ గోదావరి జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మీ ఆదేశాల మేరకు, డిఎస్పీ డి.విశ్వనాద్ పర్యవేక్షణలో,టౌన్ ఇన్స్పెక్టర్ ఎ.సుబ్రహ్మణ్యం నేతృత్వంలో, ఎస్ఐ బాదం శ్రీనివాస్ ,బృందం రాజస్థాన్ రాష్ట్రానికి వెళ్లి నిందితులను అరెస్టు చేశారు.

– అరెస్టు చేసిన నిందితులు – హనుమాన్ రామ్ జలోర్ జిల్లా,రాజస్థాన్,దినేష్ బార్మర్ జిల్లా, రాజస్థాన్.మరోవైపు,నిందితులు రాజస్థాన్‌లోని ఒక పెట్రోల్ బంకు ఓనర్ ద్వారా పిఓఎస్ మిషన్ ద్వారా రూ.7 లక్షలు పొందినట్లు విచారణలో తేలింది. పోలీసులు ఈ మొత్తాన్ని కూడా రికవరీ చేసి బాధితునికి అప్పగించారు.ఈ కేసును సమర్ధవంతంగా చేధించిన పోలీస్ అధికారులను, సైబర్ టోల్ ఫ్రీ నెంబర్ 1930 కి కాల్ చేయమని సలహా ఇచ్చి,ఆ సమయంలో ఫిర్యాది దారుడు పడుతున్న ఇబ్బందిని గుర్తించి సమయస్ఫూర్తితో వ్యవహరించి విషయం తెలుసుకుని పై బ్యాంకు అధికారులకు ఫోన్ చేసి సుమారు 10 లక్షల రూపాయలను హెూల్డ్లో పెట్టించి,20 లక్షల రూపాయలు ఎఫ్‌డిఐలను బ్రేక్ అవ్వకుండా చేసిన హెచ్‌డిఎఫ్‌సి మేనేజర్‌నుని పశ్చిమ గోదావరి జిల్లా ఎస్పీ అభినందించారు. ఈ సందర్భంలో ప్రజలు సైబర్ నేరాల పట్ల పూర్తిగా అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద కాల్స్, మెసేజులకు స్పందించకూడదని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

# శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం విద్వాంసునిగా కె.వి





**ద్వారకాతిరుమల,మేజర్‌న్యూస్ :** ఏలూరుకి చెందిన ప్రముఖ కూచిపూడి నాట్య గురువులు,సినీ నృత్య దర్శకులు కళారత్న,నాట్య కళా విశారద కేవీ సత్యనారాయణ ను ద్వారకాతిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం ఆస్థాన విద్వాంసునిగా ప్రకటిస్తూ ద్వారకా తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం అధ్యక్షులు,వ్యవస్థాపక ధర్మకర్త ఎస్‌వి సుధాకర్‌రావు నియామక పత్రం అందించి సత్కరించారు

కేవీ సత్యనారాయణ ముందుగా స్వామివారిని,అమ్మవార్లను దర్శించు కున్న తరువాత వేద పండితులు వేద ఆశీర్వచనం, స్వామివారి ప్రసాదంతో సత్కరించారు. ఇదిజీవితంలో మరిచిపోలేని రోజని, ఎన్నో సంవత్సరాలగా ద్వారకా తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని తన నాట్యం ద్వారా సేవించుతు,స్వామివారి అమ్మవార్ల పై కీర్తనలు రాసి స్వయముగా స్వామి వారి సమక్షంలో నాట్యం చేస్తున్నానని అంతే కాకుండా ద్వాదశ కోవెల ప్రదక్షిణ, స్వామి వారి తెప్పోత్సవం, పవళింపు సేవలో ఇంకా ఎన్నో ప్రత్యేక కార్యక్రమాలలో స్వామివారి ముందు నాట్య ప్రదర్శనలు తాను తన శిష్యులు ఇచ్చామని సత్యనారయణఅన్నారు. కాగా కెవి సత్యనారాయణను అవనిగడ్డ ఎమ్మెల్యే, మండలి బుద్ధ ప్రసాద్,అంబికా రాజా ఇంకా బంధుమిత్రులు అభినందనలు తెలిపారు.

# ఉండిని అన్ని రంగాల్లో సంపూర్ణ అభివృద్ధి చేయడమే లక్ష్యం







## జన్మదినోత్సవ వేడుకల్లో డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు

**ఉండి,మేజర్‌న్యూస్ :**ఉప సభాపతి ఉండి ఎమ్మెల్యే కనుమూరి రఘురామ కృష్ణంరాజు జన్మదినోత్సవ సంబరాలు అంబరాన్ని అంటాయి. కార్యకర్తలు,నాయకులు,అభిమానులు,అధికారులు నడుమ బుధవారం పెదఅమిరం రాధాకృష్ణ ఫంక్షన్ హాల్ లోజరిగింది. వేల సంఖ్యలో వచ్చిన అభిమానులు నాయకులు, కార్యకర్తలు అధికారులు రఘురామకృష్ణమ రాజుకి పుష్పగుచ్చాలు అందించి పాఠ్యపుస్తకాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రఘురామ కృష్ణంరాజు మాట్లాడుతూ ఇంతమంది అభిమానులు నడుమ నాజన్మదినోత్సవ వేడుకలు జరుపుకోవడం నాకు ఎంతో ఆనందంగా ఉందని మీఅందరి అభిమానాలు ఎల్లప్పుడు నాపై ఇలానే ఉండాలని కోరారు. పుష్పగుచ్చాలు వలన ప్రయోజనం లేదని అదేడబ్బులతో పేద విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందిస్తే ఉపయోగపడుతుందని ఉద్దేశంతో పుష్ప గుచ్చాలను వద్దన్నానని తెలిపారు. ఉండి నియోజక వర్గాన్ని అన్ని రంగాల్లోనూ సంపూర్ణ అభివృద్ధి చేయడమే నా లక్ష్యం అని వారన్నారు.

రఘురాం కృష్ణంరాజుకు శుభాకాంక్షలు తెలిపేందుకు రాజ్యసభ సభ్యులు పాక సత్యనారాయణ, మాజీ మంత్రి పీతల సుజాత, క్షత్రి కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ జనసేన పిఏసి సభ్యులు వేగేసిన సూర్యనారాయణ రాజు, (కనకరాజు సూరి). జనసేన ఉన్ని నియోజకవర్గ ఇన్చార్జ్ జుత్తిగ నాగరాజు, జిల్లా ఎస్పీ నాయకులు కార్యకర్తలు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు బమ్మెర పోతన జీవిత చరిత్ర



**పెదపాడు,మేజర్ న్యూస్ :** పెదపాడు శాఖా గ్రంథాలయం నందు ఉచిత వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా బుధవారం విద్యార్థిని విద్యార్థులకు రిసోర్స్ పర్సన్ దత్తి రేణుక ఎల్లమ్మ బమ్మెర పోతన జీవిత చరిత్రను విపులంగా వివరించారు. మందార మకరంద మాధుర్య లొలికించే ఆంధ్ర మహాభారతాన్ని రచించిన బొమ్మెర పోతన అచ్చమైన తెలుగు కవి,స్వచ్ఛమైన సహజకవి అని ఆ మహనీయుని గురించి తెలిపారు. అనంతరం కే.రాజేశ్వర్రావు రచించిన చిట్టి రాజు గూని గుర్రం' అనే కథను విద్యార్థులచే చదివించడం,పుస్తక పఠనం చేయించడం జరిగినది. తరువాత ఆటవిడుపులో భాగంగా బాల,బాలికలకు కోకో ఆట నేర్పించి ఆడించడం జరిగినది.ఈ కార్యక్రమమునకు 31 మంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొనినారు. ఈ కార్యక్రమం గ్రంథాలయ అధికారి దుగ్గిపోగు జాన్ బాబు ఆధ్వర్యంలో జరిగింది.

## నూతన గురువు విజయ్‌కు పీఠాధిపతి జయరావు ఆశీర్వాదం



**ఏలూరు,మేజర్‌న్యూస్ :** శిక్షణ పూర్తి చేసుకుని గురువుగా అభిషేకం పొందిన గోడి విజయ కుమార్‌ను బుధవారం ఆర్సిఎంఏలూరు పీఠాధి పతి డాక్టర్ పొలిమేర జయరావు ఆశీర్వదించారు. ఆర్సిఎం లక్ష్యాలకు అనుగుణంగా ఆధ్యాత్మిక విద్య వైద్య సేవ మౌలిక వసతులు కల్పన రంగాల్లో విశిష్ట సేవలు అందించాల ని సూచించారు. సువార్త విశ్వవ్యాప్తి చేయడం సంఘాల బలోపేతం తొలి ప్రాధాన్యత కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏలూరు పీఠం వికార్ జనరల్ డాక్టర్ పి.బాల,విజయ వృద్ధుల ఆశ్రమం చైర్మన్ విజయ్ ఉన్నారు.

## జిల్లా కలెక్టర్‌కు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అభినందనలు



**భీమవరం,మేజర్‌న్యూస్ :** పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మే 8న రాష్ట్ర గవర్నర్ చేతుల మీదుగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్రస్థాయి అవార్డు అందుకున్న సందర్భంగా బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నందు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ని తణుకు నియోజకవర్గం శాసనసభ్యులు ఆరుమిల్లి రాధాకృష్ణ కలిసి శాలువాతో సత్కరించి, పూల బొకే అందజేసి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆరుమిల్లి రాధాకృష్ణ మాట్లాడుతూ మానవతా సేవల్లో చూపిన విశేష కృషికి గుర్తింపుగా జిల్లా కలెక్టర్ నాగరాణి రెడ్ క్రాస్ రాష్ట్ర అవార్డు పొందటం పశ్చిమగోదావరి జిల్లా వాసులకు గర్వకారణం అన్నారు. వరదల సమయంలో కలెక్టర్ నాగరాణి స్వయంగా నష్టపోయిన ప్రాంతాల్లో పర్యటించి ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని తక్షణ సహాయం అందించడంలో ఆమె తీసుకున్న చొరవ అభినందనీయం అన్నారు. ఈ అవార్డు ఆమె సేవాభావానికి, మానవతా కార్యక్రమాలపైన ఉన్న నిబద్ధతకు గుర్తింపుగా నిలుస్తోంది అన్నారు